# నెమలి కన్ను

గోడ మీది మ్యూజికల్ గడియారం అరగంట పలికింది. పన్నెండున్నర. చదువుతున్న పుస్తకంలోంచి చటుక్కున బయటపడి 'అప్పుడే' అనుకుంది అన్నపూర్ణ. ముందు గదిలోకి వచ్చి తలుపుతీసి చూసిందామె. గేటు అవతలరోడ్డు ఇంకా ఖాళీగానే ఉంది.. చుట్టూరా ఎత్తులేని ప్రహరీగోడ నాలుగు వేపులకీ చూసింది. తలుపు ఓరవాకిలిగా వేసి కిటికీ పక్కన కుర్చీలో కూచుందామె. కిటికీ పూలతెర ఒక అరంగుళం తొలిగిస్తే ఇంటి ముందు భాగం అంతా కనిపిస్తుంది. కుర్చీ కిటికీ వేపు తిప్పి కూచుంది అన్నపూర్ణ. భార్యాభర్త లిద్దరూ స్థలం కొనుక్కుని చాలాకాలం అయింది. ఇంటికి ముందూ వెనకా జాగా ఉండాలనీ చెట్లు పెంచుకోవాలనీ ఆమె పట్టుదల. ("చెత్తాచెదారం ఎవడు తుడుస్తాడు, నీ మొగుడు?") పనిమనుషులు వారానికి మూడు నాగాల చొప్పున ఆరు నెలల్లో నెల రోజులు వరుసగా మానేసి ఇప్పటికి ఇద్దరు మారేరు. ఇంటి ముందు మూడురకాల మందారాలు, మల్లె, సంపంగి, జామ, మామిడి, పనస, సపోటా, బొప్పాయి, దబ్బలాంటి చెట్లు వెండి జరీతో అన్నికాలాల్లో నీలం దుప్పట్లు పరుస్తాయి. ఆమెకి ఉడత లంటే ప్రాణం. జామకాయలు కొరుకుతున్న ఉడతల్ని చూస్తే ఆమెకి ప్రాణంలేచొస్తుంది. పిచుకలు, మైనాలు, గోరింకలు, చిలకలు, తేనెపిట్టలు ఈ మధ్య తనెప్పుడూ చూడని రంగుపిట్టలు మామిడి చెట్టుమీద సంసారం చేస్తున్నాయి. పక్షులు చేసే విపరీతమైన అలజడి కచేరీలా ఉంటుందామెకి. అతను మూడు రేకులతో ఓ మూల కారుషెడ్డు వేయించుకున్నాడు. చెట్ల కింద పెట్టుక్కున్తకాలం ఉదయానికల్లా అంగుళం ఎత్తున రంగు రంగు రెట్టల బొమ్మలు. పక్షులకి ఉసురు తగలకుండా అన్నపూర్ణ కుళాయి ట్యూబుతో కారుకి తలంటింది కొన్నాళ్లు. "ఒద్దులే చాలు. రేపు షెడ్డు వేయించుకుంటా" నన్నాడతను. బయట అరుపులు, చప్పట్లు, సైకిలు గంటలు, పిలుపులు గదిలో పడ్డాయి. స్కూలు వదిలేశారు. పిల్లలు అల్లరి చేసుకుంటూ ఇళ్లకి బయల్దేరేరు. అన్నపూర్ణ తెర కొంచెం తప్పించి చూసింది. గోడ అవతలకి పడుతున్న చెట్ల నీడల్లో నుంచుని కబుర్లాడుతూ

వాదించుకుంటూ, నవ్వుకుంటూ గొడవచేస్తున్నారు పిల్లలు. రెండు రోడ్లు కలిసే చోట కట్టేరు ఇల్లు. ప్రహరీగోడకి దగ్గిరగా జామచెట్లు నిత్యం కాస్తూనే ఉంటాయి. ఒకడు సైకిలు గోడకి దగ్గిరగా పెట్టేడు. రెండోవాడు కేరియర్ మీద నుంచుని చిన్న కర్రతో జామకాయల్ని కొట్టడానికి సిద్ధం అవుతూ ఇల్లంతా పరీక్షగా చూ శాడు. ఎక్కడా అలికిడి లేదు. విసురుగా కర్ర తీసుకుని కొమ్మని కొట్టేడు. కాయలు రెండు బయటా ఒకటి లోపలా పడ్డాయి. వాడు మళ్లీ నాలుగువేపులా చూసి మరో విసురు విసిరేడు. ఒకటే కాయపడింది. మెల్లిగా దిగబోతుంటే సైకిలువీధిలోకి తిప్పి ఒకమ్మాయి వచ్చింది. యూనిఫాం అందరిదీ ఒకటే. వీళ్లని చూసి నవ్వుతూ ఆగిపోయింది. సైకిలు దిగబోతున్నవాడు ఆగిపోయి ఉండన్నట్టుగా చెయ్యి ఊపి మావిడి కొమ్మవేపు జాగ్రత్తగా చూసి బలంగా కర్ర విసిరేడు. అది కొమ్మల్లోకి పోయి ఏ కాయకి తగిలిందో కాయరోడ్డుమీదా కర్ర లోపలా పడ్డాయి. వాడు పిడికిళ్లు బిగించి విజయగర్వంతో నిశ్శబ్దంగా నవ్వి సైకిలు దిగేడు. జామకాయలు మగపిల్లలూ మావిడి కాయ అమ్మాయీ పంచుకుని వెనక్కి చెట్టువేపు చూస్తూ బయల్దేరేరు. కాయలు కొట్టిన వాడి సాహసాన్ని కేరింతలతో జై కొట్టేరు మిగతావాళ్లు. అన్నపూర్ణకి నలభై ఏళ్ల నవ్వొచ్చింది.

ఆమె రోజూ పిల్లకాయల్ని తెరచాటు నుంచి చూస్తూంటుంది. మామిడికొమ్మలు గోడమీంచి వీధివేపు ఒంగి ఉంటాయి. జామచెట్లూ అంతే. సంపెంగ చెట్టు కూడా దూరంగా ఉన్నా రెండు పెద్ద కొమ్మలు గోడ దగ్గిర పైన ఒంగేయి. బయటనీడలో వాసన పీలుస్తూ ఆగని అమ్మాయిలు అరుదు. ఎప్పుడేనా అన్నపూర్ణ పువ్వులుకోసం పిలిచి ఆడపిల్లల కిస్తూంటుంది. వాళ్ల సంతోషం పూల వాసనతో కలిసి ఆమెకి హాయిగా ఉంటుంది. అన్నపూర్ణకి ఆ వీధిలో వెళ్లే పిల్లల మొహాలన్నీ తెలుసు. అరుచుకుంటూ, అరుపుల్లాంటి పాటలతో ఎండా వానా లెక్కలేకుండా ఇంటికీ స్కూలికీ మధ్య ఎదిగే పిల్లల్లో ఒక కుర్రాడంటే ఆమెకి చాలా ఇష్టం. సన్నగా కొంచెం నల్లగా, నిక్కర్లోకి చొక్కా తోసి సైకిలు మీంచి అవలీలగా వాడు చిన్న కోతిముండలా, పెద్ద ఉడతలా గెంతి అర్జునుడి లాఘవంతో కాయలూ పువ్వులూ రాలుస్తాడు. నుదుటి మీద పడే ఉంగరాల జుత్తూ, ఇంతదూరం నుంచి కూడా వాడి మొహంలో, కళ్లతో తళతళ్లాడే చురుకు అల్లరి కనిపిస్తుందామెకి.

పిల్లల కోసం కాసినట్టు కొమ్మల నిండా ఎప్పుడూ కాయలుంటాయి. గోడపక్కన నీడలో నుంచుని ఇంటి నుంచి తెచ్చుకున్న కారంపొట్లం విప్పి ఉప్పూ నవ్వులూకలుపుకుంటూ మామిడిముక్కలు లొట్టలేస్తూ తింటారక్కడే. మళ్లీ సాయంకాలం వెళ్లటప్పుడు ఇంకా తీరిగ్గా ఒకళ్ల భుజానికి ఒకళుల అతుక్కుపోయి విడిపోయి మళ్లీ అతుక్కుంటూ నిక్కర్లోంచి చొక్కాలు బయటికి లాక్కుని రోడ్డుమీదే బంతి విసిరి పట్టుకుంటూ ఇంటికి వెళ్లాలనే ధ్యాస ఉన్నట్టుండదు. ఉదయం శు

భ్రంగా తలలు దువ్వుకుని బయలుదేరి మధ్యాహ్నాని కల్లా బట్టలతో సహా వాళ్లని ఉతికి ఆరెయ్యాల్సిందే. కృష్ణమూర్తిగారికి మాత్రం తరచుగా పిల్లల్తో యుద్ధం అవుతూంటుంది. "ఇంటికి నేరుగా వెళ్లలేరే వెధవలు?"

"వాళ్ల పిల్లలు గనక".

"గాడిద గుడ్డు. పోనీ ఆ గోడ లెక్కడవేవిటీ? రాళ్లు వెయ్యడం, డిసిప్లిన్ లేకుండా పోయింది. అయినా వాళ్లనని ప్రయోజనం లేదు. డిసిప్లిన్ ఇంట్లో ఏడిస్తే వీళ్లకీ వచ్చేది. అయినా మధ్యాన్నం పూట వాళ్లని కాస్త గదమాయిస్తే పోతుంది గదా?"

ఎప్పుడేనా బేంకు శలవై ఇంట్లో ఉంటే కృష్ణమూర్తి మావోయిస్టుల్ని చూసిన పోలీసైపోతాడు. ఓ పొడువాటి కర్ర సంపా యించాడాయన. మధ్యాన్నం స్కూలు వదిలేటప్పుడు, సాయంకాలం, గేటు దగ్గిర పుర్రె ఎముకల గుర్తులా నిలబతాడు. సందు తిరగ్గానే గేటు దగ్గిర కనిపిస్తాడాయన. కుర్రాళ్ల చెట్టువేపు కూడా చూడరు. కొందరయితే 'గుడ్‌మార్నింగ్ అంకుల్' చెప్తూ వినయంగా వెళ్లిపోతారు. "కోతి వెధవలు" అంటాడతను. కానీ ఏడాది అంతా కొనసాగే ఈ రుతువు ఆమెకిష్టం. అల్లరి రుతువు. అన్న పూర్ణకి ఇద్దరు పిల్లలు. పెద్దవాళ్లయి ఉద్యోగిస్తున్నారు. కృష్ణమూర్తి వాళ్లని సాధ్యమైనంత క్రమశిక్షణలో పెంచేడు. ("మీ ముగ్గురిలో ఎవరు ఎక్కువ న్యూసెన్సు చేస్తున్నారో తెలీడంలేదు.") కాలేజీ గుమ్మం తొక్కకుండానే వాళ్లు ఏం చదవాలో, ఎక్కడ చదవాలో, ఏ ఉద్యోగం చెయ్యాలో ఖచ్చితంగా నిర్ణయించుకున్నాడు కృష్ణమూర్తి. ఆ ఒక్క విషయంలో చాలాసార్లు గొడవపడ్డా రిద్దరూ.

" తండ్రిగా నా బాధ్యత. నాకామాత్రం తెలీదా? నువ్వూ చదువుకున్నదానివేగా?"

"అయితే? వాళ్లకీ ఇష్టానిష్టాలుంటాయి. వాళ్ల కిష్టమైన పనికొచ్చే చదువు చదివించండి మీరు కలెక్టరవాలంటే వాడవుతాడా?"

"నీ కొదిలేస్తే డిసిప్లిన్ లేకుండా చదవులేకుండా పోతారు."

"డిసిప్లిన్ అంటే అదిగాదు."

"అంటే నేను నోరుమూసుక్కూచ్చోవాలి. అంతేనా?"

"దానర్థం అదిగాదు."

"ఇంకేవిటి నా మొహం. సాయంకాలం హాయిగా చదువుకోకుండా ఆడుకోమని చెప్తూంటావు. నీకేవేనా సెన్సుందా?"

"చదువు, ఆటాపాటా..."

"చాలు చాల్లే. పిల్లల్ని చెడగొడుతున్నావు."

హాల్లో ఫోను మోగింది. అన్నపూర్ణ లేచి ఫోను తీసుకుంది.

"ఆ. నేనే. నేను సాయంత్రం వచ్చేసరికి తయారుగా ఉండు. బయటికి వెళ్లాలి."

"ఎక్కడికీ?"

"రెడీ అవ్వు. వచ్చి చెప్తా."

ఓ రోజు తల నొప్పిగా ఉందని మధ్యాన్నం ఇంటి కొచ్చేశాడు కృష్ణమూర్తి. ఇద్దరూ భోజనం కానిచ్చి టీవీ ముందు కూచు న్నారు. ముందు గదిలోకి వెళ్లి తలుపు సందుల్లోంచి పరకాయించింది అన్నపూర్ణ. రోడ్డు మీద గోడ దగ్గిరిగా నుంచుని జామకాయల్ని పరిశీలిస్తున్నారు ముగ్గురు కుర్రాళ్లు. ఒకడు గోడ ఎక్కమని చెప్తున్నాడు. రెండోవాడు ధైర్యం చెప్తున్నాడు. ఆమె తలుపు దగ్గిరికి వేసి వచ్చింది. కుర్చీలో కూచుని అరమోడ్పు కళ్లతో వార్తలు శ్రద్ధగా వింటున్నాడతను. దేశాన్ని ఎందుకో ఓసారి తిట్టి లేచి నుంచున్నాడతను. లుంగీ లాగి కట్టుకుంటూ ముందుగదిలోకి వెళ్లేడు.

"ఎక్కడికండీ?"

కొన్ని క్షణాల తరవాత ఒక గావుకేక, "ఎవడ్రావాడు'తో సహా. అన్నపూర్ణ తేరుకుని లేచి వెళ్లేసరికి లుంగీ ఎగకట్టి గోడవేపు పరిగెడుతున్నాడు కృష్ణమూర్తి. గోడమీద నుంచున్న కుర్రాడు అతని కేక విని గడ్డకట్టుకుపోయాడు. బయటనుంచున్న వాడి సహచరులు 'రేయి దూకెయ్యేరా' అంటూ పరుగు లంకించుకున్నాడు. అన్నపూర్ణ గుమ్మం దగ్గిర ఆగిపోయింది. కుర్రాడు ఆమె వేపు చూసి, వెంటనే దూకేడు. ఎటొచ్చీ భయంతో గోడ అవతలకి దూకబోయి లోపలికి దూకి గేటు వేపు పరిగెట్టబోయి చతికిలబడ్డాడు. అప్పటికి కృష్ణమూర్తి శత్రువుని సమీపించాడు.

"ఎవడ్రా నువ్వు? గోడెందుకు కెక్కేవు?"

ఏ క్షణంలో అయినా వాడు నిక్కరు తడిపేసుకోడం తప్పదనుకుంది అన్నపూర్ణ.

"గోడెందుకెక్కావు?"

"రవణగాడు ఎక్కమన్నాడంకుల్."

"ఏ క్లాసు చదువుతున్నావు?"

"సిక్స్త్ అంకుల్."

"మీ నాన్నగారి పేరేవిటి?"

వాడు ఏడుపుతో భయంతో పేలిపోడానికి సిద్ధంగా ఉన్న ఉల్లిపొర సంచీలా ఉన్నాడు. అన్నపూర్ణ గుమ్మం దగ్గిర్నుంచి కేక వేసింది.

"ఏవండీ, మీ సెల్ మోగుతోంది. వాణ్ని నేను చూస్తాను మీరు రండి."

"పారిపోనీకు వీణ్ని."

"ఖైదీని అప్పగించి గబగబ లోపలికి వెళ్లేడు కృష్ణమూర్తి. అతని వెనకాలే వచ్చిందామె.

"ఏదీ ఫోనన్నావు?"

'ఆగిపోయిందేమోనండీ."

"అవునూ, వాడేడీ?"

"వాడా, చెయ్యి లాక్కుని పారిపోయాడు."

"చెయ్యికోరికే డన్నావుగాదు."

"అలిసిపోయారు మంచినీళ్లు తాగండి."

"చుట్టూరా ఇన్ని చెట్లు ఒద్దంటే విన్నావా? నువ్వెన్ని జామకాయలు తినుంటావు?"

"పోన్లెండి. అయినా అన్నీ మనం తిండాని కనుకుంటే ఎలాగండీ?"

"అలాక్కాదుగానీ గోడమీద చుట్టూరా ముళ్ల తీగవేయిస్తాను. ఏ వెధవా గోడెక్కడు."

"ఒద్దులెండి. డబ్బులు దండగ."

"ఏం ఫరవాలేదు."

గోడమీద ఇనపకంచె గొడవ ఉదయానికల్లా మర్చిపోయింది అన్నపూర్ణ. కానీ మర్నాడు మధ్యాహ్నం కృష్ణమూర్తి ఫోన్ చేశాడు.

'పూర్ణా, తెలిసున్నవా డొకడు కంచె వేయిస్తానన్నాడు. చూడ్డానికి రేపో ఎల్లుండో వస్తాడు."

సెప్టిక్ అయితే ఎంత ప్రమాదం అనుకుందామె. మూడోరోజు సాయంత్రం ఇద్దరు మనుషులు ఇల్లు వెదుక్కుంటూ వచ్చేరు.

"గోడమ్మిట అయగారు తీగ సుట్టమన్నారంటండి. పని చూసుకుందారని ఒచేవండమ్మా."

"ఆహా, అదా?"

"అన్నేపులా ఎయ్యాలండమ్మా?"

"ఆ... అయ్యగారు చెప్పలేదా, మర్చిపోయుంటారు."

"మా మేస్త్రీగారు చెప్పేరండి."

"అదిగాదయ్యా. మేం ఊరెడుతున్నాం. ఒచ్చిం తరవాత కబురు చేస్తాం."

"అంటే, ఇప్పుడొద్దంటారా అమ్మా."

"అదే. ఊర్నించి రాగానే కబురుపెడతాం. అయ్యగారికి మీరొచ్చి వెళ్లేరని నేను చెప్తాలే."

"ఆయ."

నాలుగు రోజుల తరవాత అడిగేడు కృష్ణమూర్తి.

"పూర్ణా, వాడెవడో మేస్త్రీ మనుషుల్ని పంపుతా నన్నాడు. ఎవరూ రాలేదుగదూ?

అంతే, ఒక వెధవని నమ్మడానికి వీల్లేదు."

"పోన్లెద్దురూ."

భోజనం వడ్డించుకుని నవ్వుకుంది అన్నపూర్ణ. మామిడిచెట్టులో ప్లాస్టిక్ డబ్బాలతో రెండు మూడు గూళ్లు చేయించి పెడితే ఎలా ఉంటుందని ఆలోచిస్తూ అన్నం తినడం మొదలుపెట్టిందామె. రెండు మూడు రోజుల తరవాత నాలుగవకుండా ఇంటికొచ్చేడు కృష్ణమూర్తి. బట్టలు మార్చుకుని టీ తాగుతూ ఉత్తరాలు చూస్తున్నాడతను. చటుక్కన తల ఎత్తి అన్నాడతను.

"మర్చేపోయాను. ఆ మధ్య మేస్త్రీ మనుషులొచ్చేరట గదా? రాలేదన్నావు?"

"ఏమోనండీ. ఎవరో వచ్చేరనుకుంటాను."

"నేను బేంకు మేనేజర్ని. ఈ మాత్రం తెలివితేటలు నాకూ ఉన్నాయి. ఇష్టం లేదని చెప్పొచ్చుగా. అంత బుర్ర లేదనుకున్నావా నాకు?"

"ఏమో బాబూ. అయినా వాళ్లతో మాట్లాడ్డం నాకు చాతకాదు."

"ఖర్మరా నాయనా."

మళ్లీ ఉత్తరాలు చదువుకుంటూండగా ఆమె ఊపిరిపీల్చుకుంది. మరుక్షణంలో క్రికెట్ బంతి తగిలినట్టు ముందు గది అద్దం ఠాప్ మంది. ఉలిక్కిపడ్డా డతను.

"ఏవిటదీ?"

"ఉండండి చూసొస్తాను."

"రాయి. కుర్రవెధవలు రాళ్లు విసుకుతున్నారు. ఉండు."

అంటూ అతను లేచేడు. ఇద్దరూ ముందుగది తలుపు తీసేటప్పటికి కుర్రాళ్లు పారిపోతున్న అలజడి తప్పరోడ్డు ఖాళీగా ఉంది.

"పారిపోయారు రాస్కెల్సు."

"అమ్మయ్య" అనేసిందామె.

కిటికీ అద్దం సాలెగూడులా బీటలు తీసింది. దాన్ని చూడగానే అతనికి చెంప పగిలినట్టయింది. ఇద్దరూ లోపలికి వచ్చేరు. ఆమె మళ్లీ టీ కప్పుతీసుకుని అంది.

"వీళ్లకి అల్లరి మరీ ఎక్కువయిపోతోంది. రేపు చెప్తానుండండి." అతనామె వేపు చూస్తూ అన్నాడు.

"కుర్రాళ్లని చంపుతా ననుకున్నావా? రెండు తగలనివ్వకపోతే డిసిప్లిన్ రాదు. అట్లా ఒదిలేస్తే రోజుకో కిటికీ పగలగొడతారు. పిల్లలకి క్రమశిక్షణ ఉండాలా వద్దా? పిల్లలు డీసెంట్‌గా ఉండాలి. అలా పెంచాలి పెద్దవాళ్లు. ఏవిటో తలకాయ లేకుండా మాట్లాడతావు." ఆమె ఏవీ మాట్లాడలేదు. టీ చప్పరిస్తూ ఉండిపోయింది. మళ్లీ

ఆయనే అడిగేడు.

"ఏవి టాలోచిస్తున్నావు?"

"మా నాన్న మమ్మల్ని చాలా డిసిప్లీన్‌లో పెంచేరు. ఏం తినాలో, తినకూడదో, ఏ బట్టలు వేసుకోవాలో, ఎప్పుడు వేసుకోవాలో మా ఇష్టనిష్టాలన్నీ ఆయనవే. స్కూల్నించీ కాలేజీ నుంచీ తిన్నగా ఇంటికి రావాలి. ఫ్రెండ్స్ ఇళ్లకి వెళ్లినా దానికి కొన్ని కండిషన్లు ఉండేవి. ఎక్కడ వస్తువులు అక్కడే ఉండాలి. అల్లరి చెయ్యడం అంటే ఏవిటో మాకు తెలీదు. నాకూ అన్నయకీ పదోఏడు వచ్చేసరికి పాతికేళ్లు నిండేయి. పెద్దగా అరవకూడదు. అప్పుడు టీ.వీలు లేవనుకోండి. బట్టలు మాపుకోకూడదు. ఇందాకా మావిడికాయకోసం రాయి విసిరిన..."

"మావిడికాయకోసం అని నీకు చెప్పేడా?"

"జామకాయలకోసం అయితే బెడ్రూం గ్లాసు పగిలేది." నవ్వే డతను.

"వాళ్లు జామకాయలు కొనుక్కోలేక కాదు. ఇంట్లో కొనరనీ కాదు. ఆ గోడెక్కి మనకి తెలీకుండా కాయలుకొట్టిన సంతోషం కొంటే రాదు. మీరు పిల్లలకి ఎప్పుడూ క్లాసులో మీదే ఫస్టు రేంకు అని చెప్తుండేవారు. మంచిదే. కానీ మావయ్యగారి సైకిలు దొంగ తనంగా తీసికెళ్లి మోకాల్చిప్పకి దెబ్బ తగిలించుకుని సైకిలు పడేసినందుకు మావయ్యగారు మిమ్మల్ని నాలుగు పీకేరని చెప్తుంటే కలిగే సంతోషం వేరు. క్లాసులో ఫస్టు రావడం కేవలం గర్వం. వాడా రాయి విసిరిన కుర్రాడు గొప్పగా ఫ్రెండ్సు అందరితో చెప్పుకుం టాడు. చిన్న హీరో అయిపోతాడు. వాడికి పెళ్లయిన తరవాత ఇలాగే పిల్లలతో కూచుని ఓ బేంకు మేనేజరుగారి చెట్ల కాయలు దొంగ తనంగా ఎలా కొట్టేడో కిటికీ గ్లాసు ఎలా పగిలిందో, మిమ్మల్ని ఇమిటేట్ చేస్తూ చిలవలూ పలవలూ కలిపించి చెప్తాడు. ఈ చిన్న తనం జ్ఞాపకాలుగా మిగిలిపోతుంది. అటువంటి జ్ఞాపకాలు లేని చిన్నతనం ముసలితనం లాంటిది. అందుకే మనం ఎక్కువగా చిన్నప్పటి సంగతులు చెప్పుకుంటాం. అందుకే ఆ కుర్రవాళ్లని ఏవీ అనను. వాళ్లు గోడెక్కడం నేను చూస్తూనే ఉంటాను. నవ్వుకుంటాను.... ఆ మేస్త్రీ మనుషుల్ని పంపించాడు. నేనే వెళ్లిపొమ్మన్నాను."